ప్రజాశక్తి
ఆదివారం 10 మార్చి, 2024
5
శ్రీకాకుళం

గ్రామీణ రహదారుల అభివృద్ధికి కృషి

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

జలుమూరు: గ్రామీణ ప్రాంతాలకు రోడ్ల సదుపాయ కల్పనకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని కొమనాపల్లి కూడలి వద్ద లుకలాం నుంచి కొమనాపల్లి వరకు బిటి రోడ్డు నిర్మాణానికి రూ.150 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య, ఎంపిపి వాన గోపి, మండల పార్టీ అధ్యక్షులు కనుసు సీతారాం, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు పైడి విఠల్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పెరుమాళ్ల తవిటినాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు మొజ్జాడ శ్యామల రావు, జెసిఎస్ కన్వీనర్ ధర్మాన జగన్ పాల్గొన్నారు.

కొబ్బరి పార్కు కలేనా?

- వాగ్ధానాలకే పరిమితం
- ఆచరణలో కనిపించని చిత్తశుద్ధి
- రైతులకు తప్పని ఎదురుచూపులు

కొబ్బరి పార్కు కొన్ని దశాబ్దాలుగా ఉద్దానం రైతును ఊరిస్తున్న అంశం. ఈ అంశం తెరపైకి వచ్చినప్పుడల్లా అదిగో పార్కు, ఇదిగో అనుమతులు అంటూ పాలకులు హడావుడి చేస్తున్నారు. ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో నాయకులకు ఇది ప్రధాన అస్త్రంగా మారిపోయింది. కొన్ని దశాబ్ధాలుగా కొబ్బరి అంశం పలు దఫాలుగా తెరపైకి వచ్చి కనుమరుగవుతోంది. మాటల్లో తప్ప చేతల్లో పనులు జరగడం లేదనేది బహిరంగ సత్యం. కానీ, ఉద్దానం కొబ్బరి రైతాంగంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న వేలాది మంది రైతుల మేలుచేకూర్చే కొబ్బరి పార్కు మాత్రం కలగానే మిగిలిపోయింది.

ప్రజాశక్తి- కవిటి

జిల్లా వ్యాప్తంగా 53 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో కొబ్బరి సాగు చేస్తున్నారు. అందులో ఒక్క కవిటి మండలంలోని సుమారు 23 వేల ఎకరాలకు పైగా కొబ్బరి సాగు జరుగుతోంది. నమ్మకం నాణ్యతలో ఉద్దానం కొబ్బరికి పెట్టింది పేరు. దీంతో గోదావరి జిల్లాలతో పాటు మిగతా ప్రాంతాల్లో పండిన కొబ్బరి కంటే ఉద్దానం కొబ్బరి ధర అధికంగా ఉంటుంది. అయితే గత కొంతకాలంగా ఉద్దానం కొబ్బరిని తెగుళ్లు, వ్యాధులు చుట్టుముట్టడం, వ్యవసాయ ఖర్చులు పెరగడం, నిలకడ నిలకడ లేని ధరలతో కొబ్బరి రైతు విలవిలలాడుతున్నాడు. ఎంత కష్టపడినా సరే సరైన ప్రతిఫలం లభించడం లేదనే నిరాశలో ఉన్నాడు. ఓవైపు పెరుగుతున్న ఖర్చులు మరోవైపు తరుగుతున్న ఆదాయాలతో కుటుంబాలు నడపలేక రైతన్న సతమతమవుతున్నాడు. ఇలాంటి సమయంలో తాను పండించిన పంటకు సరైన గిట్టుబాటు, అదనపు ప్రయోజనాలు లభించాలంటే దానికి ప్రభుత్వ సహకారం అవసరమని భావిస్తున్నాడు.

కొబ్బరి పార్కుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

సాంకేతిక కారణాలు సాకుతో...

మరోవైపు కొబ్బరి పార్కు ఏర్పాటుకు సాంకేతిక కారణాలు సాకుగా చూపి మభ్యపెట్టే పరిస్థితులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. వాస్తవానికి కవిటి మండలం తీర ప్రాంతానికి దగ్గరగా ఉండడం తరచూ తుపాన్లకు గురవుతోంది. దీంతో మొదటి నుంచి ఈ ప్రాంతంలో ఎకరాకు 80 నుంచి 120 కొబ్బరి చెట్లు నాటే సంప్రదాయం ఉంది. అయితే 2018లో వచ్చిన తితిలీ తుపానుకు సగానికి పైగా చెట్లు పోయాయి. ప్రస్తుతం అక్కడ కొబ్బరి పార్కు ఏర్పాటు చేస్తే సరిపడే కాయలు ఉత్పత్తి చేసే అవకాశం లేదని బుకాయింపు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఎకరాకు 50 నుంచి 60 కొబ్బరి చెట్లు ఉండాలి. కానీ, ఇక్కడ అంతకు రెట్టింపు సంఖ్యలో ఉంటున్నాయి. మరో వైపు కవిటి మండలంలో చిక్కాఫ్, కొబ్బరి ఉత్పత్తిదారుల సంస్థ పేరుతో రెండు సంస్థలు కొబ్బరి రైతుల ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తున్నాయి. మండలంలో ఉన్న కొబ్బరి రైతులందరూ ఈ రెండు సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. సుమారు 90 శాతం పైగా రైతులు ఈ రెండింటిలో ఏదో ఒక దాంట్లో సభ్యత్వం పొంది ఉన్నారు. అయితే ఇటీవల కాలంలో కొబ్బరి పార్కు రావాలంటే రైతులు సంఘాలుగా ఏర్పడాలని కొంతమంది ప్రచారం చేస్తున్నట్టు తెలుస్తోంది. వాస్తవానికి ఉద్యానశాఖ ఆధీనంలో మండలాల్లోనే కాక జిల్లా వ్యాప్తంగా ఎంత విస్తీర్ణంలో కొబ్బరి పంట సాగు చేస్తున్నారు. ఎంతమంది కొబ్బరి రైతులు ఉన్నారు, కొబ్బరిపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతమంది జీవిస్తున్నారనే అంశాలు పూర్తి డేటాతో సహా ఉన్నాయి. కానీ, ఏదో ఒకటి చెప్పాలి, ఏదోఒక విధంగా ఈ అంశాన్ని దాటవేయాలనే ధోరణికి ఈ సంఘటనే ఉదాహరణ అని పలువురు రైతులు వాపోతున్నారు. నాణ్యమైన, నమ్మకంతో కూడిన పంటను రైతులు అందిస్తున్నప్పుడు ప్రభుత్వాలు ఎందుకు తమపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ప్రశ్నిస్తున్నాడు. ఇప్పటికే వ్యవసాయ రంగం పూర్తిగా నిర్వీర్యమవుతోందని, ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వాలు తమకు అండగా నిలవాలి తప్ప అంగట్లో నిలబెట్టకూడదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొన్ని వేల కుటుంబాలకు ఆసరా కల్పించే కొబ్బరి పార్కు ఏర్పాటుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరుతున్నారు.

కొబ్బరి పార్కు తప్పనిసరి

ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్దానం ప్రాంతంలో కొన్ని వేల కుటుంబాల మనుగడకు కొబ్బరి ఆధారిత పరిశ్రమలు తప్పనిసరి. అందులో భాగంగానే కొన్ని ఏళ్లుగా కొబ్బరి పార్కు కోసం ఎదురుచూపులు. ప్రస్తుతం రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. వెలుగు, డిఆర్‌ఎ ఆధ్వర్యాన కొబ్బరి ఉత్పత్తిదారుల సంస్థ కొబ్బరి రైతుల ఆర్థిక స్వావలంబనకు చాలావరకు కృషి చేస్తోంది. అదే కొబ్బరి పార్కు ఏర్పాటు చేస్తే రైతుకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుంది.

- బల్లెడ జయప్రకాష్,
కొబ్బరి ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షుడు

సిఎం దృష్టికి తీసుకెళ్లాం

కొబ్బరి రైతుల స్థితిగతులు, కొన్ని వేల కుటుంబాలకు కొబ్బరి పార్కు ఏ విధంగా అవసరం అన్న విషయాలు ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకెళ్లాం. గతేడాది ఏప్రిల్‌లక్ష దీనిపై ఆయనికి వినతిపత్రం అందించాం. ఆయనా సానుకూలంగా స్పందించారు. ఈపాటికే కొబ్బరి పార్కుకు అనుమతులు వచ్చి పనులు ప్రారంభం కావాల్సింది. కొన్ని అనివార్య కారణాల వల్ల జాప్యం జరిగింది. రైతులకు సంబంధించిన ఎటువంటి విషయమైనా సిఎం ప్రత్యేక దృష్టి సారిస్తారు. త్వరలోనే కొబ్బరి పార్కుపై సానుకూల నిర్ణయం వస్తుంది.

- కడియాల పద్మ, ఎంపిపి

ప్రతిపాదనలు పంపించాం

శిలగాంలో సర్వే నంబరు 110లో ఉన్న 21 ఎకరాల్లో 13 ఎకరాల్లో కొబ్బరి పార్కు ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. పార్కు ఏర్పాటు కోసం జెకె ఫౌండేషన్ రూ.50 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలూ చేసింది. వాస్తవానికి కరోనా ముందే కొబ్బరి పార్కుకు అనుమతులు రావాల్సింది. తరువాత కొన్ని కారణాలు వల్ల పార్కు ఏర్పాటుకు ఆలస్యమైంది. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే కొబ్బరి పార్కు పనులు ప్రారంభిస్తాం.

- పి.మాధవీలత,
ఉద్యాన శాఖ అధికారి, కవిటి

ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

ప్రజాశక్తి- కొత్తూరు

దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఆదివాసీ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు డిమాండ్ చేశారు. ఈ 10న గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ... రాష్ట్ర వ్యాప్తంగా ఏజెన్సీ బంద్‌కు నేపథ్యంలో నాలుగు రోడ్ల కూడలి వద్ద ఆదివాసీ జనరక్షణ దీక్షను శనివారం చేపట్టారు. ముందుగా ఈ దీక్షా శిబిరాన్ని గోవిందరావు ప్రారంభించారు. అనంతరం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు. సిర్ల ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గిరిజనులకు స్పెషల్ డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయులను నియమించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అటవీ సంరక్షణ చట్టానికి చేసిన సవరణతో ఆదివాసీలు తమ భూములు కోల్పోతున్నారని అన్నారు. జగన్ ప్రభుత్వం పోడు భూమలకు పట్టాలిస్తామని పదే పదే ప్రకటించినా ఆచరణలో అమలు చేయలేదన్నారు. పైగా రాజ్యాంగా విరుద్ధంగా ఏజెన్సీ భూములను అదానీకి అప్పణంగా కట్టబెడుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ఆదివాసీలకు తీరని అన్యాయం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల గోడు అరణ్యరోదనగా మిగిలిపోయిందన్నారు. ఆదివాసీ సంఘాలు, ఉద్యోగ, నిరుద్యోగ జెఎసిలు మార్చి 10న బంద్‌కు ఇచ్చిన పిలుపును సిపియం బలపరుస్తుందన్నారు. జిల్లాలోని ప్రజా సంఘాల నాయకులు, పాలకులు గిరిజనుల న్యాయమైన హక్కులకు సంఘీభావం ప్రకటించాలని పిలుపునిచ్చారు. ఇటీవల విడుదల చేసిన డిఎస్‌పి నోటిఫికేషన్ రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయడంతో ఆదివాసీలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. షెడ్యూల్ ప్రాంతానికి 534 టీచర్ పోస్టులు భర్తీ చేస్తామంటూ... చివరికి ఆదివాసీ నిరుద్యోగులకు కేవలం 38 పోస్టులు కేటాయించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ప్రభుత్వం పునఃపరిశీలించి ఏజెన్సీలో ఉద్యోగాలన్నీ గిరిజనుల నిరుద్యోగులకే దక్కే విధంగా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్ ప్రాంతంలో వంద శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పిస్తున్న జిఒ నంబరు 3ను సుప్రీం కోర్టు రద్దు చేసిందని అన్నారు. అనంతరం దీని పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలకు ఉపక్రమించకపోవడంతో ఆదివాసీ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. రాజ్యాంగంలో ఐదో షెడ్యూల్ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే ఏ ఉత్తర్వులైనా షెడ్యూల్ క్లాజ్ (1)(2) ప్రకారం గవర్నర్, టిఎసి అనుమతి తప్పకుండా తీసుకోవాలన్నారు. కానీ, జనరల్ డిఎస్‌సి నోటిఫికేషన్ జారీపై ఇటువంటి ప్రక్రియను దిక్కరించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. గిరిజన తెగల భాష బోధించడానికి నియమితులైన భాషా వాలంటీర్లను రెగ్యులర్‌గా చేయాలన్నారు. కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన గురుకులాల్లో అవుట్ సోర్సింగ్, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో సిఆర్‌టి ఉద్యోగులు స్థానాల్లో గిరిజనేతరులను ప్రభుత్వం భర్తీ చేయాలని చూస్తోందని, ఇది అన్యాయమని వాపోయారు. కేంద్ర ప్రభుత్వం సవరించిన అటవీ చట్టం ప్రకారం ఐదో షెడ్యూల్‌లోని ఆదివాసీలకు నష్టం వాటిల్లుతుందన్నారు. అడవులు అదానీ లాంటి కార్పొరేట్ కంపెనీల పరమవుతున్నాయని విమర్శించారు. అడవులపై ఆదివాసీలు సంప్రదాయ, చట్టబద్ధ హక్కులన్నీ కోల్పోతాయని అన్నారు. 2006 చట్ట ప్రకారం పోడు భూములను సాగు చేస్తున్న వేలాది ఆదివాసీ కుటుంబాలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీక్షలో గిరిజన సంఘ నాయకులు నిమ్మక అప్పన్న, ఎస్.మోహనరావు, ఎస్.సింహాచలం, ఎస్.దుర్గారావు, పి.లక్ష్మణరావు, పి.శ్రీను, దుర్గారావు, జయమ్మ పాల్గొన్నారు.

కొత్తూరు : దీక్ష చేస్తున్న నాయకులు

టెక్కలి రూరల్ : మాట్లాడుతున్న ఎల్లయ్య

బంద్‌ను విజయవంతం చేయాలి

టెక్కలి రూరల్ : గిరిజన సంఘం ఆధ్వర్యాన ఈ నెల 10న చేపట్టనున్న మన్యం బందును విజయవంతంచేయాలని ఎపి రైతు సంఘం జిల్లా జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సిపిఎం నాయకులు కొల్లి యల్లయ్య పిలుపునిచ్చారు. మండలంలోని ముఖలింగాపురం పంచాయతీ బెండకాయలుపేట, జక్కరపేటలో అవగాహనా ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు, నందిగాం మండలం నాయకులు పాలిన సాంబమూర్తి, సిన్నింటి జమ్మయ్య, దేశాటి నీలవేణి, జి ముత్యాలమ్మ, డి.ప్రకాష్, కొత్తూరు రాజులు అడ్యాడ కామయ్య పాల్గొన్నారు.

నేడు ఎన్‌జిఒ రాష్ట్ర నాయకులు జిల్లాకు రాక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్‌జిఒ రాష్ట్ర అసోసియేషన్‌కు ఇటీవల నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన కె.వి.శివారెడ్డి, చౌదరి పురుషోత్తం నాయుడులు ఆదివారం జిల్లాకు రానున్నారని జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వారితో పాటు ప్రభుత్వ సలహాదారు ఎన్.చంద్రశేఖరరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు నగరానికి చేరుకుంటారన్నారు. వారికి నగరంలోని సింహద్వారం వద్ద ఎన్‌జిఒ, ఇతర ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు స్వాగతం పలుకుతారని తెలిపారు. అక్కడి నుంచి జెడ్‌పి సమావేశ మందిరం వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం జెడ్‌పి సమావేశ మందిరంలో అభినందన సభ, సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. అభినందన సభకు రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు హాజరుకానున్నట్టు తెలిపారు.

నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి ప్రసాదరావు

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

రెవెన్యూ మంత్రి ప్రసాదరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

మహిళల ఆర్థికాభివృద్ధి ప్రభుత్వం కృషి చేస్తుందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మండలంలోని మండలంలోని సింగుపురం జెడ్‌పి హైస్కూల్ ఆవరణలో వైఎస్‌ఆర్ చేయూత నమూనా చెక్కును శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్ ఇచ్చిన మాటను నిలుపుకున్నారని అన్నారు. డ్వాక్రా రుణాల చెల్లింపునకు ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. జగన్‌ను ఎదుర్కొనేందుకు పొత్తులంటూ దేశ రాజధాని ఢిల్లీలో రెండ్రోజులుగా చంద్రబాబు, పవన్ నానా హడావుడి చేస్తున్నారని వాఖ్యానించారు. చంద్రబాబు ఎన్ని పొత్తులు పెట్టుకున్నా ప్రజలు ఆయనను విశ్వసించరని పేర్కొన్నారు.

కార్యక్రమంలో సర్పంచ్ గుండ ఆదిత్యానాయుడు, వైసిపి నాయకులు ధర్మాన రామ్ మనోహర్ నాయుడు, డిఆర్‌డి పీడీ విద్యాసాగర్, ల్లా రైతు విభాగం అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, ఎంపిపి అంబటి నిర్మల, జెడ్‌పిటిసి రుప్ప దివ్య, డిసిఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఎఎంసి చైర్మన్ ఎం.తాతబాబు, వైసిపి మండల అధ్యఓఉలు చిట్టి జనార్ధనరావు, ఎంపిటిసిలు బుగ్గ అప్పారావు, నక్క శంకర్ పాల్గొన్నారు.

పోరాటాలతోనే మహిళా హక్కులు సాకారం

సిఐటియు జిల్లా అధ్యక్షులు అమ్మన్నాయుడు

ప్రజాశక్తి- రణస్థలం

మహిళా హక్కులు, స్వేచ్ఛ కోసం పోరాటం చేయడమే అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్ఫూర్తిని కొనసాగించడమని సిఐటియు జిల్లా అధ్యక్షులు చింతాడ అమ్మన్నాయుడు అన్నారు. మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని సిఐటియు ఆధ్వర్యాన రణస్థలం హైస్కూల్ ఆవరణలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1917 మార్చి 8న లక్షలాది మంది మహిళా కార్మికులు హక్కుల కోసం, మహిళలకు ఓటు హక్కు కోసం ఆందోళన చేపట్టారని గుర్తు చేశారు. దీంతో మార్చి 8న మహిళా దినోత్సవ తేదీగా నిర్ణయించారని అన్నారు. ఈ దినోత్సవం మహిళల కోర్కెల దినంగా చరిత్రపుటల్లో నిలిచిందన్నారు. స్కీమ్ కార్మికులకు పనికి తగిన పరిహారాన్ని చెల్లించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫమయ్యాయని అన్నారు. అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజన పథకం తదితర స్కీమ్ కార్మికుల శ్రమకు తగిన ఫలితం ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోపిడీ చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను ప్రజలకు చేర్చి వారికి అవసరమైన సేవలు అందించడంలో వారు కీలక పాత్ర పోషిస్తున్నారు. అంగన్వాడీలకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. శ్రామిక మహిళలపై శ్రమదోపిడీ, లైంగిక దోపిడీ నానాటికి తీవ్రతరం అమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కె.సుజాత, నాయుకులు ఆర్.అప్పమ్మ, బి.స్వాతి, బి.అసిరితల్లి. బి.సుజాత పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

14న రైతు సమస్యలపై ఆందోళన

ప్రజాశక్తి- పలాస

సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యాన ఈనెల 14న దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, రైతులు, కార్మికులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, రైతు కూలి సంఘం జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు పిలుపునిచ్చారు. కాశీబుగ్గలో ఓ ప్రయివేటు స్థలంలో వామపక్ష, ప్రజా సంఘాలు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఢిల్లీ కేంద్రంగా రైతులు సాగిస్తున్న పోరాటానికి సంఘీభావంగా ఈ నెల 14 జిల్లా వ్యాప్తంగా నిరసనలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఢిల్లీ కేంద్రంగా లక్షలాది మంది రైతులు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతు సమస్యలు పరిష్కారం చేయాలని ఆందోళన సాగిస్తున్నా పట్టించుకోకపోవడం దూర్మార్గమని అన్నారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలు రద్దు చేస్తూ... స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేసి పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చి రెండేళ్ల గడుస్తున్నా... ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని అన్నారు. పోరాట సమయంలో రైతులపై పెట్టిన కేసులు ఎత్తేస్తామని చెప్పిన మాట ప్రకారం వెంటనే కేసులన్నీ ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. రైతులను ట్రాక్టర్‌తో తొక్కి చంపిన బిజెపి నాయకులను తక్షణమే అరెస్టు చేయాలన్నారు. విద్యుత్ చట్టసవరణ బిల్లు రద్దు చేయాలన్నారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. సమావేశంలో సిపిఐ నాయకులు సిహెచ్.వేణుగోపాల్, ఎఐకెఎం జిల్లా కార్యదర్శి మద్దిల రామా రావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, ఎపి రైతు సంఘం నాయకులు టి.భాస్కరరావు, ఎపి రైతు కూలీ సంఘం నాయకులు కె.గురయ్య, పి.కె.ఎస్.నాయుకులు కె.పురుషోత్తం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాధవరావు

ప్రజల మనసు గెలుచుకున్న 'దానేటి'

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వైద్య వృత్తితో పాటు సేవా భావంతో ప్రజల మనసుకు దగ్గరైన డాక్టరు దానేటి శ్రీధర్ అని మాజీ మంత్రి గుండ అప్పల సూర్య నారాయణ అన్నారు. నగరంలోని సింహద్వారం సమీపంలోని మెడికవర్ ఆస్పత్రిలో డాక్టర్ దానేటి శ్రీధర్ 50వ పుట్టిన రోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దంపతులకు గజమాలతో సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిజాయితీలో కూడిన సేవలను ప్రజలు ఆదరిస్తారన్నారు. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి మాట్లాడుతూ దానేటి ఆశయాలు నేటితరం యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు.

గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

పలు సేవా కార్యక్రమాలు

డాక్టర్ దానేటి శ్రీధర్ పుట్టినరోజు సందర్భంగా నగరంలోని వద్ధాశ్రమాలు, అనాథ శరణాలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పళ్లు పంపిణీ చేశారు. మెడికవర్ ఆస్పత్రిలో మంది శ్రీధర్ అభిమానుల మధ్య పుట్టిన రోజు వేడుకలు అంగరంగ వైభవంగా జరిగింది. పలాస నుంచి పెద్ద ఎత్తున జనసేన నాయకులు ఆస్పత్రికి వచ్చి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వైద్యులు పి.జె.నాయుడు, దుంపల హరిప్రసాద్, సీపాన రాజేష్, ఆర్‌కె, పలాస జనసేన నాయకులు సంతోష్ పండా, కిల్లి బాలకృష్ణ, బంగారు కేదార్, మేడిశెట్టి నర్శింహమూర్తి, పైల చిట్టిబాబు, టిడిపి నాయకులు జామి భీమశంకర్, కోరాడ హరగోపాల్, కోరాడ రమేష్ పాల్గొన్నారు.

పొత్తు లాభం... పొందు నష్టం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

టిడిపి, బిజెపి దాగుడు మూతలకు తెరపడింది. 2018లో ఎన్‌డిఎ నుంచి బయటకు వచ్చిన టిడిపి ఆ తర్వాత కొద్ది నెలలు పాటు బిజెపికి దూరంగానే ఉంది. వైసిపి నుంచి దాడులు తీవ్రతరం కావడంతో బిజెపితో సఖ్యతతో ఉండటం ప్రారంభించింది. లోక్‌సభలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టే బిల్లులన్నింటికీ టిడిపి మద్దతు పలికింది. అందులో ఒక బిల్లే రైతులకు నష్టం తెచ్చే వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లను బిగించడం. దేశంలోనే శ్రీకాకుళం జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి బిజెపి ఇక్కడి అమలు చేయించింది. రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనా టిడిపి దానినీ ఖండించనూ లేదు. రైతుల ఆందోళనలకు మద్దతు కూడా పలకలేదు. రైతుల్లో ఆందోళన నెలకొన్న నేపథ్యంలో గ్రామాల్లో వైసిపి నాయకులే తమ భుజ స్కందాలపై వేసుకుని ఆ పని పూర్తయ్యేలా చూసుకున్నారు. మీటర్ల బిగింపు పని మీటర్లను బిగింపు పని 90 పూర్తయిన తర్వాత మీటర్ల బిగించేందుకు పంపు సెట్ల దగ్గరకు అధికారులు వస్తే వాటిని విసిరికొట్టాలంటూ టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు పిలుపు నిచ్చారు. బిజెపి తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలను టిడిపి, వైసిపి పూర్తి చేశాయి.

బిజెపితో స్నేహం చెడిపోతుందని విభజన హామీలపై ఇప్పటివరకు టిడిపి ఏ సందర్భంలోనూ నోరెత్తలేదు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, విశాఖకు రైల్వేజోన్ తదితర అంశాలపై వివిధ సందర్భాల్లో వామపక్షాలు, ప్రజా సంఘాలు చేసిన ఆందోళనలకూ దూరంగానే ఉంది. ఇప్పుడు బిజెపితో పొత్తు కుదరడంతో కాషాయం పెద్దలు చెప్పినట్లు ఇక అదీ ముగిసిన అధ్యాయంగానే టిడిపి చూసే అవకాశం లేకపోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వెనుకబడిన జిల్లాకు ఎడాదికి రావాల్సిన ఐదు కోట్లను టిడిపి ఎన్‌డిఎలో ఉన్నప్పుడే 2018లో ఆపేశారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు చేయకుండా బిజెపి మోసం చేసిందనే ఉద్దేశంతోనే అప్పుడు టిడిపి ఎన్‌డిఎ నుంచి బయటకు వచ్చింది. ఇప్పుడు అవేవీ నెరవేరకపోయినా బిజెపితో కలిసి ఎన్నికలకు వెళ్లాలను కోవడం ప్రజలను మరోసారి వంచన చేయడమే అవుతుంది. విభజన హామీలు అమలు చేయకపోగా ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మేసేందుకు బిజెపి ప్రభుత్వం రకరకాల ప్రయత్నాలు సాగిస్తూనే ఉంది. బిజెపికి అన్ని విధాలుగా పరోక్షంగా మద్దతు పలుకుతున్న వైసిపి ప్రభుత్వం తన వంతు సహకారం అందిస్తోంది. స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేస్తున్నా జగన్ మాట్లాడటం లేదంటూ టిడిపి అధినేత చంద్రబాబు ఇటీవల జిల్లా పర్యటన సందర్భంగా జగన్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఫిబ్రవరిలో జిల్లాలో చేపట్టిన శంఖారావం యాత్ర సందర్భంగా జిల్లా పర్యటనకు వచ్చిన జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ మరో అడుగు ముందుకేసి అవసరమయితే ప్రభుత్వమే కొనుగోలు చేసి నిర్వహిస్తుందంటూ చెప్పుకొచ్చారు. బిజెపితో పొత్తులేని వైసిపియే ప్రయివేటీకరణపై మాట్లాడలేక చేతులెత్తేస్తే పొత్తు కుదుర్చుకున్న టిడిపి ఇంకేమి మాట్లాడుతుందనే అంతా పెదవి విరుస్తున్నారు. బిజెపి వ్యతిరేక ఓటు చీలకూడదనే ఏకైక లక్ష్యమే తప్ప ప్రజలకు బిజెపి చేసిన మోసాన్ని టిడిపి, జనసేనలు పరిగణనలోకి తీసుకోవడం లేదు. రాబోవు ఎన్నికల్లో పొత్తు ఆ పార్టీలకు లబ్ధికలగొచ్చు గాక ప్రజలకు మాత్రం ఏరకంగా చూసుకున్నా నష్టమే కనిపిస్తోంది.

పొత్తులతో మరోసారి అధికారం పొందాలని చూస్తున్న బిజెపి ఓటర్లకు గాలం వేసేందుకు రకరకాల ఎత్తులు వేస్తోంది. ఎన్నికల సమయంలో వంట గ్యాస్ సిలిండర్ ధర తగ్గించినట్లు ప్రకటించి సామాన్య ప్రజానీకాన్ని ఏమార్చేందుకు మోడీ ప్రభుత్వం కొత్త జిమిక్కులకు దిగింది. 2014లో తొలి సారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.410గా ఉంది. దాదాపు ప్రతినెలా రూ.25 నుంచి 50 వరకు పెంచడంతో గతేడాది జూలై నాటికి గ్యాస్ ధర రూ.1130కి చేరింది. గతేడాది ఆగస్టులో ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో లబ్ధిపొందేందుకు రూ.200 తగ్గించింది. దీంతో గ్యాస్ సిలిండర్ ధర రూ.930కి చేరింది. సాధారణ ఎన్నికలకు నోటిఫికేషన్‌కు ఎన్నికల సంఘం సమాయత్తమవుతుండటంతో గ్యాస్ ధరను మోడీ ప్రభుత్వం మహిళా దినోత్సవ కానుకంటూ మరో రూ.వంద తగ్గించింది. సిలిండర్ ధర మోయలేనంతగా పెంచిన మోడీ ప్రభుత్వానికి దాదాపు పదేళ్లుగా మహిళా దినోత్సవం, మహిళల కష్టాలు కనిపించినట్లు లేదు. పదేళ్ల బిజెపి పాలనలో వంట గ్యాస్‌తో పాటు పెట్రోల్, డీజిల్ ధరలూ పెరిగాయి. వాటి ప్రభావంతో నిత్యవసర ధరలూ ఆకానంటాయి. వీటి జోలికి వెళ్లని బిజెపి ప్రభుత్వం కేవలం సిలిండర్ ధరను మాత్రం తగ్గించి మహిళల ఓట్లను పొందాలని బిజెపి ప్రభుత్వం సాగిస్తున్న ప్రయత్నాలను అంతా తిప్పిగొట్టాల్సిన సమయం ఆసన్నమైంది.

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHIT'S AT NARASARAOPET.
Dispute No.114/2023

Between:-
M/S LAKSHMI TULASI CHIT FUND PVT LTD. NARASARAOPET, REP BY ITS FORE MAN/BRANCH MANAGER.
.... Petitioner/Disputant
AND
Gunji Venkateswarlu, & Others
... Respondents/Opponents

To,
Respondents/Opponents No.3)
Pagoti Durga Rao,(age 31y) S/o Prasada rao, Occ: Railway Track Maintner, D.No:1-52,Gorribanda, Saravakota, Srikakulam-532426.

పై నెంబర్ పిటిషన్ నందు 3వ రెస్పాండెంట్ అయిన మీకు పై పిటిషన్ లో శ్రీకోర్టు వారి ద్వారా నోటీసులు పంపిననూ మీరు తీసుకోనందున ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయడమైనది ఏమనగా పై పిటిషన్ లో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల ది.16-03-2024 న ఉదయం 10:30 గం.ని లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా కానీ లేదా మీ వకీలు ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు ఉంటే తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు.

P.Chakrapani,
Advocate for Petitioner/Disputant
NARASARAOPET

పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలో పలు పోలింగ్ కేంద్రాలను టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ శనివారం స్థానిక ఆర్ఐ శివతో కలిసి పరిశీలించారు. మండలంలో హరిశ్చంద్రపురం, నిమ్మాడ, చిట్టేవలస, నీలంపేట, ఎత్తురాళ్లపాడు తదితర పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, మరుగుదొడ్ల తదితర మౌలిక సదుపాయాలు, రూట్ మ్యాప్‌లను పరిశీలించారు. అలాగే పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సమస్యలను రెవెన్యూ సిబ్బందికి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి తుల రాజారావు, విఆర్ఒ బమ్మిడి విశ్వనాథం, సిబ్బంది తేజేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఒపిఎస్‌ను మేనిఫెస్టోలో చేర్చాలి

ప్రజాశక్తి- టెక్కలి

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలవుతున్న సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఒపిఎస్ ఇస్తామనే హామీని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో చేర్చాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఓట్‌ఫర్ ఒపిఎస్ నినాదంలో భాగంగా శనివారం స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెన్షన్ ఉద్యోగుల, ఉపాధ్యాయుల హక్కని బిక్ష కాదని సుప్రీం కోర్టు చెప్పిన తీర్పును అమలు చేయాలన్నారు. ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు ఊతమిచ్చేలా పాలన ఉందన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేక జిపిఎస్ విధానాన్ని అమలు చేయాలని చూడడం సమంజసం కాదన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు కురమాన దాలయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.బాబురావు, బమ్మిడి శ్రీరామమూర్తి, జిల్లా కార్యదర్శి బి.శంకరరావు, టెక్కలి, నందిగాం సంతబొమ్మాలి మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పి.గణపతిరావు, తమ్మినేని వైకుంఠరావు, కె.కుమారస్వామి, వై.గణపతిరావు, డి.గణపతిరావు, టి.పాపారావు పాల్గొన్నారు.

స్థానికులతో కలిసి ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న సింహాచలం

ప్రభుత్వ భూముల అమ్మకాలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని గాజుల కొల్లివలస ఆర్ అండ్ ఆర్ కాలనీలో రెవిన్యూ అధికారుల అండతో భూముల కొనుగోలు, అమ్మకాలు ముమ్మరంగా జరుగుతున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం అన్నారు. తులగాం వంశధార నిర్వాసితుల కోసం ప్రభుత్వం సమీకరించిన మిగులు భూములను రాజకీయ నాయకులు, బ్రోకర్లు రెవెన్యూ అధికారుల అండతో అమ్మకాలు చేపడుతున్నట్లు తమ పరిశీలనలో తేలిందన్నారు. బ్లాక్ నెంబర్-2 లో ప్లాట్ నెంబర్ 22, 21, 15, 16, 18, 19, 17, 53, 51 బ్లాక్ నెంబర్-3 లో ప్లాట్ నెంబర్ 102, 103, 104, 75 ఇలా అనేక ప్లాట్‌లను అనర్హులు ఇతర మండలాలకు చెందిన వారు కొనుగోలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్లాట్ల క్రయవిక్రయాలపై జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకొని సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బండి విజయమ్మ, కళింగపట్నం అప్పన్న, కళింగపట్నం అంకమ్మ పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి- నందిగాం

మండలం కణితివూరు, హరిదాసుపురం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాలు, సచివాలయ భవనాలు, హెల్త్ క్లినిక్ భవనాలను వైసిపి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ శనివారం ఎంపిపి నడుపూరు శ్రీరామమూర్తితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ సిఎం జగన్ మోహన్ రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి పేద ప్రజలకు ప్రభుత్వ పథకాలు ఇంటి వద్దకే అందజేసి దేశంలోనే ఆదర్శ సిఎంగా నిలిచారన్నారు. ప్రజలంతా మరిన్ని మెరుగైన సేవలను అందుకుని జగన్మోహన్ రెడ్డికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపిలు వై.చక్రవర్తి, కింతల ధర్మారావు, మండల పార్టీ అధ్యక్షులు తమరి ఫల్గుణరావు, జెసిఎస్ మండల కన్వీనర్ జడ్యాడ జయరాం, పిఎసిఎస్ అధ్యక్షులు బాలక మధుసూదనరావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, సర్పంచ్‌లు కనితి ధనలక్ష్మి నారాయణమూర్తి, పేరాడ విమల యుగంధర్ పాల్గొన్నారు.

'జీడి' మహాధర్నాను జయప్రదం చేయాలి

పలాస : కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద సోమవారం ఉదయం 10 గంటలకు జీడి రైతుల సంఘం, వామపక్షాల ఆధ్వర్యంలో జీడికి మద్దతు ధర ప్రకటించాలని కోరుతూ చేపడుతున్న జీడి మహాధర్నాను విజయవంతం చేయాలని జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ కోరారు. మండలంలోని నీలావతి, గురుదాసుపురం, మాకన్నపల్లిలో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడిపిక్కల 80 కేజీలు బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించి, ఆర్‌బికెల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ రైతు ఉద్యమ స్ఫూర్తితో పలాస కాశీబుగ్గ పట్టణంలో జరుగుతున్న ఈ మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతుకూలీ సంఘం నాయకులు గురయ్య, ఎం.రామారావు, ఎపిరైతు సంఘం వజ్రపుకొత్తూరు మండల నాయకులు తమ్మినాన భాస్కర్, దొబ్బ భాస్కరరావు, బానమ్మ పాల్గొన్నారు.

ఎర్రన్నాయుడు విగ్రహావిష్కరణ

మెళియాపుట్టి: మండలంలో గొప్పిలిలో కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు విగ్రహావిష్కాన్ని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం ఆవిష్కరించారు. ఎర్రన్నాయుడు ఆశయ సాధనకు కృషి చేస్తామని అన్నారు. అంతకుముందు టెక్కలిపట్నం నుంచి గొప్పిలి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్, భాస్కర్‌గౌడ, బుర్ల లలితకుమారి, మాలతి ఢిల్లీరావు పాల్గొన్నారు.

విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అచ్చెన్నాయుడు

సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి- పొందూరు

రాష్ట్ర భవిష్యత్ టిడిపి అధినేత చంద్రబాబుతోనే సాధ్యమని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. మండలం బురిడికంచరాంలో శనివారం టిడిపి, జనసేన శంఖారావం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ ఒక్కచాన్స్ అంటూ రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసి రాష్ట్రాన్ని రుణాంధ్రప్రదేశ్‌గా సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మార్చారన్నారు. ఉపాధి అవకాశాలు లేక యువత అల్లాడిపోతున్నారన్నారు. కలలకు రెక్కలు పేరుతో విద్యార్థునులకు సరికొత్త పథకాన్ని అమలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్, టిడిపి, జనసేన మండల అధ్యక్షులు చిగిలిపల్లి రామ్మోహన్, యలకల రమణ, టిడిపి

పొందూరు : సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తున్న రవికుమార్

మండల ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి బాడాన శేషగిరి, వండాన మురళీ, టిడిపి జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కరరావు పాల్గొన్నారు.

ఆమదాలవలస: వైసిపి ప్రభుత్వం ఇంటికి వెళ్లే రోజులు దగ్గరలోనే ఉన్నాయని టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ అన్నారు. పట్టణంలో 13వ వార్డు కిల్లివారి క్వార్టర్స్, ధర్మారావు క్వార్టర్స్ ప్రాంతాల్లో సూపర్ సిక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బొడ్డేపల్లి రమణమూర్తి, తిర్లంగి నారాయణమూర్తి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మండలంలోని కొర్లకోటలో జిల్లా టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి సనపల ఢిల్లేశ్వరరావు ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, గొండు రవి, సానపల్లి తేజ, అన్నెపు కిషోర్, టిడిపి, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

లావేరు: మండలంలోని పెదకొత్తపల్లి కొత్తూరుపేట గ్రామాల్లో బాబూ ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రామ్‌మల్లిక్‌నాయుడు, మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, మాజీ ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, మాజీ జెడ్‌పిటిసి పి.మధుబాబు, సర్పంచ్ ఆరేళ్ల కృష్ణ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి- కవిటి

కవిటిలో నూతనంగా నిర్మిస్తున్న కళ్యాణ వేంకటేశ్వర దేవాలయ నిర్మాణానికి దాతలు ఉదారంగా విరాళాలు అందిస్తున్నారు. మండలం గొండ్యాల పుట్టుగకు చెందిన గొండ్యాల విష్ణు రూ.5 వేలు విరాళంగా అందించగా, రాజపురంకు చెందిన జెన్నెల శంకరరావు రూ.5వేలు అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి- కవిటి

పంచాయతీలో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు జగతి సర్పంచ్ పూడి వరప్రసాద్, వైస్ ఎంపిపి పూడి నేతాజీ తెలిపారు. రూ.8.5లక్షలతో చిన్నకర్రివానిపాలెం ప్రధాన రహదారి నుంచి జగతిలోని సుజలా మంచినీటి పథకం వరకు సిసి రహదారి నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పంచాయతీలో అన్ని గ్రామాలకు సమాన ప్రాధాన్యత కల్పిస్తూ, పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చీకటి భుసరాజు, భావన రవి, హేమంత్, జానకిరావు పాల్గొన్నారు.

క్రమశిక్షణ అలవర్చుకోవాలి

ప్రజాశక్తి- టెక్కలి

విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణను అలవర్చుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ అన్నారు. కళాశాల రెండవ జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో రావివలసలో శనివారం శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడుతూ కళాశాల్లో చదువుకునేందుకు వచ్చే విద్యార్థులు సేవా దృక్పథంతో ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సలాన బాలకృష్ణ, పిఏ వి.లూక్‌పాల్, విశ్రాంత ఉపాధ్యాయులు పి.మల్లేశ్వరరావు, వైస్ ఎంపిపి మన్యాల కిషోర్, అధ్యాపకులు ఎన్‌హెచ్‌కె.జనార్ధనరావు, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ చేపడుతున్న అధికారులు

ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలి

వజ్రపుకొత్తూరు: అక్రమాలకు పాల్పడుతూ దురుసు ప్రవర్తనతో వ్యవహరిస్తున్న సైనూరు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ బి.జగదీశ్వరిని విధుల నుంచి తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. శనివారం సర్పంచ్ అట్టాడ గోవిందరావు ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్‌పై వచ్చిన ఫిర్యాదుపై అధికారులు విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ వేతనదారులు వెంకటరమణ, దివాకర్, జానకమ్మ తదితరులు ఫీల్డ్ అసిస్టెంట్ తీరును అధికారులకు వివరించి వారిపై మండిపడ్డారు. ఉపాధిహామీ కూలీలపై ఫీల్డ్ అసిస్టెంట్ చిన్నచూపు చూస్తు అనుచితంగా వ్యవహరించిన తీరు సరైన చర్య కాదన్నారు. 2023 అక్టోబర్‌లో స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ పనులకు హాజరుకాని మేట్ డి.సరస్వతి పేరు మీద ఆరు రోజులు పనికి వెళ్లినట్లు మస్టర్ వేసి రూ.1500, మరో మేట్ లక్ష్మి రెండు రోజులు పనికి వెళ్లగా అరు రోజులు పని చేసినట్లు మస్టర్ వేసి అక్రమాలకు పాల్పడుతుందని కూలీలు నిలదీశారు. ఫీల్డ్ అసిస్టెంట్ తమను ఇష్టానుసారంగా దూషిస్తుందని దీనిపై జిల్లా కలెక్టర్‌కు, డుమా పీడీకి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎపిఒ పి.కేశవరావు, ఇసి హరినాథ్ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ పనితీరుపై విచారణ నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

మౌలిక సదుపాయాలు కరువు

శ్రీకాకుళం అర్బన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆమదాలవలస నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయాలనుకుంటున్నానని, న్యాయవాది లోలుగు వెంకట రాజశేఖర్ అన్నారు. నగరంలోని ఓ ప్రయివేట్ భవనంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో రాజకీయం ఒక కుటుంబానికే పరిమితమైందని పేర్కొన్నారు. ప్రస్తుత పాలకులు మౌలిక సదుపాయాలు కల్పనలో విఫలమవుతున్నారని విమర్శించారు. సుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తానని హామీ నిచ్చిన జగన్మోహన్‌రెడ్డి మాట తప్పి మడమ తిప్పేశారని విమర్శించారు. సమావేశంలో సీనియర్ న్యాయవాది చీడి శంకర్‌నారాయణ, ఉంగ్రాళ్ల రాము, దువ్వు కృష్ణారావు, గిడుతూరి ఆదినారాయణ పాల్గొన్నారు.

మహిళల నిర్ణయాధికార స్వేచ్ఛకు పోరాటం

శ్రీకాకుళం అర్బన్: మహిళలకు రక్షణ, విలువ, ఉపాధి లేకుండా చేస్తున్న మనువాద కార్పొరేట్ పాలనకు వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాలని, మహిళల నిర్ణయాధికార స్వేచ్ఛ సాధించాలని పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షులు ఎస్.కృష్ణవేణి పిలుపునిచ్చారు. నగర శివారులోని పెద్దపాడు గాంధీనగర్ కాలనీలో అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం సందర్భంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివక్షతలకు వ్యతిరేకంగా, పాలకులు హరించిన హక్కులను తిరిగి రాబట్టుకునేందుకు, మహిళా చట్టాలను రక్షించుకుని స్త్రీ, పురుష సమానత్వాన్ని సాధించుకునేందుకు మహిళలు పోరాడాలన్నారు. అఖిల భారత రైతు కూలీ సంఘం (ఎఐకెఎంఎస్) రాష్ట్ర నాయకులు తాండ్ర ప్రకాష్ మాట్లాడుతూ మహిళలకు జీవనోపాధిని కల్పిస్తున్న భూమిని కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైందన్నారు. కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు నేతింటి నీలంరాజు, చిన్నారావు, అప్పలరాజు పాల్గొన్నారు.

'ఐతమ్' విద్యార్థుల కృషి అద్భుతం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో (2019-2023) విద్యా సంవత్సరంలో ఎలక్ట్రికల్ కోర్స్ పూర్తిచేసిన విద్యార్థులు సోలార్ పవర్ సహాయంతో 'పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్' ను నూతనంగా తయారు చేయడం పట్ల కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు అభినందించారు. ఈ సందర్భంగా ఈ యూనిట్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ సూర్యరశ్మి ఆధారంగా పనిచేసే ఈ పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ ద్వారా ఒకేసారి వేలాది మందికి సమాచారాన్ని క్షణాల్లో చేరవేయవచ్చన్నారు. తెల్లకాగితంతో పాటు కార్మిక శ్రమ, సమయం ఆదా అవుతుందన్నారు. ఇప్పటికే ఇఇఇ విభాగంలో ఉన్న 9 తరగతి గదులను పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ కిందకు తీసుకొచ్చినట్టు వివరించారు. భవిష్యత్‌లో బొగ్గు ఆధారిత పవర్ ఉత్పత్తి తగ్గిపోతున్నందున ప్రత్యమ్నాయ ఏర్పాట్లకు విద్యార్థులు కృషిచేయాలన్నారు. ఈ విధానాన్ని కళాశాల మొత్తం అమలు చేసేందుకు కావలసిన ప్రణాళికలను సిద్ధం చేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్

పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్ నాగేశ్వరరావు

ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఇఇఇ హెచ్‌డి డాక్టర్ కె.కిరణ్‌కుమార్‌కు ఆదేశించారు. ఈ మొత్తం ప్రాజెక్టు వ్యయం దాదాపు రూ.90వేలుకాగా విద్యార్థులు పి. అవేక్, ఎం.డి.అర్షద్, ఎస్.మనోజ్ కుమార్, కె.శివరామకృష్ణ, ఎం.హేమంత్, ఎం.డి.అనుష్, జి.వి.అనిరుద్ర, జి. శిరీషా, కె.దేవిప్రసాద్, బి.సంయుక్త, హెచ్.ఉషారాణి, కె.సంతోష్, జి.వంశీ, సిహెచ్.శిల్ప, ఎం.నరేష్ , అధ్యాపక బృందం డాక్టర్ జి.రామారావు, సిహెచ్.ప్రసాద్, ఎన్.సౌజన్యల ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టును తయారు చేయుటకు కృషిచేశారన్నారు. కార్యక్రమంలో డీన్లు డాక్టర్ డి.విజయ్ కుమార్, డాక్టర్ డి.ఆజాద్ పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వారికి కండువా వేస్తున్న శిరీష

గిరిజన సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి- పలాస

వైసిపి ప్రభుత్వం గిరిజనులకు అన్యాయం చేసిందని, గిరిజన గ్రామాల్లో రోడ్లు, తాగునీరు సరఫరా చేయలేదని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. టిడిపి కార్యాలయంలో శనివారం మందస మండలం కొండలోగాం, నర్సింగిపురం, కుసుమాల పంచాయతీలకు చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు సుమారు 60 కుటుంబాలు టిడిపిలో చేరాయి. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే గిరిజన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. గిరిజన సమస్యలు చెప్పుకునేందుకు ఐటిడిఎ ఏర్పాటు చేస్తామని, ప్రతి గిరిజన గ్రామంలో తాగునీరు, కాలువలు, రోడ్లు నిర్మిస్తామన్నారు. మంత్రి సీదిరి అప్పలరాజు మాటలు చెప్పడమే తప్ప గిరిజన గ్రామాలను అభివృద్ధి చేయలేదన్నారు. టిడిపిలో సవర రవి కుమార్, సవర రామారావు, జైపాల్, దానెల్, అభిరామ్, గబ్రేల్ తదితరులు చేరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, మల్లా శ్రీనివాసరావు, బావన దుర్యోధన, లబ్బ రుద్రయ్య, రట్టి లింగరాజు, తాతారావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తా

మున్సిపాల్టీలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని గౌతు శిరీష అన్నారు. 29వ వార్డులో శనివారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులో నెలకొన్న ప్రధాన సమస్యలు, తాగునీటి సమస్యను శిరీషకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె స్పందిస్తూ ఎటువంటి సమస్యలు వచ్చినా మీ వెంట నేను ఉంటానని హామీ ఇచ్చారు. ఆమెతో పాటు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు, నవీన్ ఉన్నారు.

కోటబొమ్మాళి: టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో శనివారం టిడిపి కార్యాలయంలో నందిగాం మండలం బోరుభద్ర పంచాయతీకు చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు టిడిపిలో చేరారు. వీరికి అచ్చెన్నాయుడు పార్టీ కండువ వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నందిగాం మండల పార్టీ అధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్, ఆయా పంచాయతీలకు చెందిన పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మేం సిద్ధం...మా బూత్ సిద్ధం

పోలాకి: మండలం డి.ఎల్.పురం, కొత్త రేవు, అంపలాం పంచాయతీల్లో శనివారం మేం సిద్ధం మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. బిసిసెల్ జోనల్ ఇన్‌ఛార్జి ధర్మాన కృష్ణ చైతన్య పాల్గొని ముఖ్య నాయకులతో బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నాయకులు సిద్ధంగా ఉండాలని, ప్రజలను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసేందుకు సిద్ధపర్చాలన్నారు. అంపలాం గ్రామంలో దాసరి లచ్చుము టిడిపి నుంచి వైసిపిలో చేరారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగి నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కణితి కృష్ణారావు, జిల్లా బిసిసెల్ ఉపాధ్యక్షుడు చింతాడ ఉమ, మండల పార్టీ యువజన విభాగం అధ్యక్షులు రెంటికోట త్రినాధరావు పాల్గొన్నారు.

లావేరు: రెండోసారి సిఎంగా జగన్మోహన్ రెడ్డిని చేసేందుకు

సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణచైతన్య

నాయకుడు, కార్యకర్త కష్టపడి పని చేయాలని వైసిపి నాయకుడు లుకలాపు అప్పలనాయుడు అన్నారు. సిద్ధం కార్యక్రమంలో భాగంగా కొత్తకోట, గోవిందపురం, బెజ్జిపురం, లావేరు తదితర పంచాయతీల నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల మాజీ ఎంపిపి బళ్లాడ జనార్ధన్ రెడ్డి, బురాడ వెంకటరమణ, ధర్మవరం సర్పంచ్ కన్నబాబు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మహిళా హక్కుల కోసం పోరాటం

మాట్లాడుతున్న సుగుణవతి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాల ద్వారా పైచేయి సాధించుకోవాలని ఐద్వా జిల్లా నాయకులు బి.సుగుణవతి, శ్రామిక మహిళా నాయకులు ఎం.మంజుల కుమారి అన్నారు. శనివారం నువ్వలరేవులో మహిళా దినోత్సవ సభ చామంతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో, ఉత్పత్తిలో కీలక భాగస్వామిగా ఉన్న మహిళలను రెండవ తరగతి పౌరులుగా చూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా సాధికారత కోసం పాలకులు ప్రచారమే తప్ప ఆచరణలో భిన్నంగా వ్యవహరిస్తున్నారన్నారు. అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, ఉపాధిహామీ వంటి స్కీమ్‌ల్లో మహిళలచే వెట్టిచాకిరీ చేయించు కుంటున్నారన్నారు. మహిళలు పని ప్రదేశాల్లో, బయట లైంగిక వేధింపులకు గురవుతున్నా సరైన చర్యలు లేవన్నారు. సిఐటియు నాయకులు ఎస్.మోహనరావు మాట్లాడుతూ ఆర్థికంగా స్వావలంబన సాధించినప్పుడే మహిళలకు గౌరవం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్.ధనలక్ష్మి, బి.చామంతి, ఇందు, కమల, ప్రమీల విజయశ్రీ, నిర్మల, యశోద పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి- సంత బొమ్మాళి

ప్రతి గడపకు సంక్షేమ పథకం అందించే ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని జగన్నాథపురం సర్పంచ్ జోగి రాములమ్మ అన్నారు. శనివారం గ్రామంలో నవరత్నాల్లో భాగంగా సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వాలంటీర్లు, వార్డు మెంబర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలం చిన్నసాన సర్పంచ్ బోనేల ఎల్లయ్య ఆధ్వర్యంలో ఎంపిపి ఉమామల్లేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షుడు మురళీ, మండల పార్టీ అధ్యక్షుడు సత్యరాజు ఇంటింటికి వెళ్ళి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు నాగేశ్వరరావు, దుక్క రోజా, మండల విప్ బొడ్డు అప్పన్న, జెసిఎస్ కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు, జిల్లా రైతు భరోసా అడ్వైజరి కమిటీ సభ్యులు కవిటి రామరాజు ఉన్నారు.

టెక్కలి: రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే

సంతబొమ్మాళి : సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న రాములమ్మ

ప్రజలకు శ్రీరామరక్ష అని బోప్పాయిపురం సర్పంచ్ గుజ్జు మొహన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన సంక్షేమ పథకాల పోస్టర్లను శనివారం గ్రామంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కూన సూర్యారావు, త్రినాధరావు, తులసి అప్పారావు, సచివాలయ డిడిఒ పాల రవికుమార్ రెడ్డి, వర్ధన్, రామానాయుడు, ఆశారాణి పాల్గొన్నారు.

కాలిపోతున్న గడ్డివాములు

గడ్డివాములు దగ్ధం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

సంతబొమ్మాళి గ్రామ వెలమ వీధికి చెందిన చల్ల జగ్గారావు, వెలమల అప్పారావు, బొమ్మాళి పాపయ్య, తంగి అప్పలరాజుకు చెందిన 20 ఎకరాల గడ్డివాములు అగ్నికు ఆహుతయ్యాయి. టెక్కలి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. సంవత్సరానికి సరిపడ పశుగ్రాసం కాలి బూడిద అవ్వడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.50 వేలు అస్తి నష్టం జరిగినట్లు రైతులు తెలిపారు.

కూలిన కొబ్బరి చెట్టు

ఇంటిపై కూలిన కొబ్బరి చెట్టు

ప్రజాశక్తి- కవిటి

మండలం మహంకాళి పుట్టుగలో శుక్రవారం రాత్రి మహంకాళి జమున ఇంటిపై కొబ్బరిచెట్టు కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో అందరూ నిద్రిస్తున్నా ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ డి.భద్రాచలం సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. ఇంటి పైకప్పు దెబ్బతినడంతో ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చి తక్షణ సహాయంగా బియ్యం, కూరగాయలు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- పొందూరు

మండలం కింతలి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో ఆదివారం ఉదయం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఇఇ ఎస్.బయ్యన్నాయుడు, ఎఇ దుర్గాప్రసాద్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో 33/11 కెవి వైర్లు మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల విద్యుత్ నిలిపివేస్తున్నట్టు తెలిపారు. కింతలి, కనిమెట్ట, తోలాపి, ధర్మపురం, దల్లవలస, పిల్లలవలస, పెనుబర్తి, అచ్చిపోలవలస, మొదలవలస, బొడ్డేపల్లి తదితర గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైసిపి హయాంలో పెరిగిన నిరుద్యోగం

శ్రీకాకుళం అర్బన్: టిడిపి పూర్వ వైభవానికి కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి కార్యకర్తలను కోరారు. శనివారం నగరంలోని గ్రీన్ కన్వెన్షన్‌లో టిడిపి కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిని చేయడం ద్వారా రాష్ట్ర ప్రగతిని కాపాడు కోవాలన్నారు. ఈ ఐదేళ్లలో యువత పెద్దఎత్తున నష్టపోయారని అన్నారు. సమావేశంలో మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, ముద్దాడ కృష్ణమూర్తినాయుడు, చిట్టి నాగభూషణం, ఉంగటి రమణ పాల్గొన్నారు.

భువనేశ్వర్ నుంచి విశాఖకు వందే భారత్ రైలు

ఆమదాలవలస: భువనేశ్వర్, విశాఖ పట్నం వందే భారత్ రైలును ఈనెల 12న ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించనున్నారు. సోమవారం మినహా ఈ రైలు వారానికి ఆరు రోజులు ప్రయాణిస్తుంది. 443 కిలోమీటర్లు ఈ రైలు ప్రయాణిస్తుందని రైల్వే అధికారులు ప్రకటించారు. ప్రతిరోజు ఉదయం 5:15 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి కుర్ధా రోడ్డుకు 5.33 గంటలకు, బరంపూర్ 7.05, ఇచ్ఛాపురం 7.18, పలాస 8.18, శ్రీకాకుళం రోడ్డు 9.03, విజయనగరం 9.48, విశాఖపట్నం 11 గంటలకు చేరుతుందని రైల్వే అధికారులు తెలిపారు. తిరిగి ఇదే రైలు విశాఖపట్నంలో 3.45, విజయనగరం 4.30, శ్రీకాకుళం రోడ్ 5.28, పలాస 6.30, ఇచ్ఛాపురం 7.00, బరంపూర్ 7.20, కుర్ధా రోడ్ 8.57, భువనేశ్వర్ 9.30 గంటలకు చేరుకుంటుందని అధికారులు షెడ్యూల్ ప్రకటించారు. హాల్టింగ్ సౌకర్యం ఉన్న ప్రతి రైల్వే స్టేషన్‌లో ఈ రైలు రెండు నిమిషాల పాటు హాల్టింగ్ కల్పించినట్లు అధికారులు తెలిపారు.

డ్రమ్ములను పంపిణీ చేస్తున్న సూర్యనారాయణ

డ్రమ్ములు పంపిణీ

కొత్తూరు: మండలంలోని లబ్బ రైతు భరోసా కేంద్రంలో పిఎసిఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ రూ.పది వేలు విలువైన ఎస్‌సి రైతులకు శనివారం డ్రమ్ములను పంపిణీ చేశారు. లబ్బలో 11 మందికి, సిరుసువాడలో ముగ్గురికి, మాతలో 17 మంది రైతులకు ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా నవధాన్యాలు కిట్లు, తార్పాలిన్లు అందజేశారు. రైతు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులందరూ ప్రకృతి వ్యవసాయ చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు టి.ధర్మారావు, సూర్యనారాయణ, పెంటయ్య, గోవింద, మోహిని, చిన్న పాల్గొన్నారు.

మోకాళ్లపై నిరసన

కవిటి: తమజాతి గుర్తింపు, తమ భవిష్యత్ భరోసా కోసం పోరాడుతున్న బెంతు ఒరియాలు శనివారం మోకాళ్లపై నిలబడి తమ నిరసన తెలిపారు. కవిటి బస్టాండ్‌లో చేస్తున్న ఈ రిలే నిరాహారదీక్షల్లో 73వ రోజు బొరివంక గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ తమజాతికి గుర్తింపు లభించే వరకూ, తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసా దక్కేవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఆముదాల భాస్కర్, జగన్నాథం బిసాయి, కాళీ సాహు, హరికృష్ణ, కుర్మా సాహు, శివ బిశాయి పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు

ఆమదాలవలస: పట్టణంలోని భవిత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల ఆత్మీయక వీడ్కోలు సమావేశం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చిన్నారులు వేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. పలు సినీ గేయాలకు హైస్కూల్ విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అంతకు ముందు జరిగిన సమావేశంలో పాఠశాల కరస్పాండెంట్ సువ్వారి మురళీధరరావు మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నతంగా ఎదగాలన్నారు. విద్యార్థి దశలో ఒక లక్ష్యాన్ని ఏర్పర్చుకొని బాగా చదివి రాణించాలన్నారు.